క్లుప్తంగా

భూలోకమ్మ అమ్మవారిని దర్శించుకున్న జక్కంపూడి రాజా



భూలోకమ్మ అమ్మవారి సన్నిధిలో జక్కంపూడి రాజా, నాయకులు

ధవళేశ్వరం: భూలోకమ్మ అమ్మవారిని ఆదివారం వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. వాడపేటలోని భూలోకమ్మ అమ్మవారి జాతర మహోత్సవానికి విచ్చేసిన జక్కంపూడి రాజా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జక్కంపూడి రాజాకు ఉత్సవ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పేర్ల బాసి, సాధనాల చంద్రశేఖర్ (శివ), షబ్బర్ భాషా, గఫూర్ ఉన్నారు.

డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజుకు పలువురి పరామర్శ



ఆకుల ఈశ్వరమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజును ఆదివారం పలువురు పరామర్శించారు. వీర్రాజు మాతృమూర్తి ఆకుల ఈశ్వరమ్మ ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఈశ్వరమ్మ చిత్రపటానికి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆకులవీర్రాజు, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. వివిధ పార్టీల నాయకులు, నగర ప్రముఖులు దేవలంకరాము, బత్తుల రాము, సుందరపల్లి ప్రేమ్‌కుమార్, గట్టి సుబ్బారావు, కురుమళ్ల ఆంజనేయులు, ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

తాడేపల్లిగూడెం బస్సుల దారి మళ్లింపు

రాజమహేంద్రవరం సిటీ: నిడదవోలులో రైల్వే గేట్ వద్ద రహదారి క్లోజ్ చేసిన కారణంగా రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూడెం వెళ్లే బస్సులను వయా నిడదవోలు, తిమ్మరాజుపాలెం, అప్పారావుపేట, మాధవరం , నవాబుపాలెం, ప్రత్తిపాడు రోడ్డు మీదుగా మళ్లించినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి యేలూరి సత్యనారాయణమూర్తి ఆదివారం ప్రకటించారు. ఉదయం 5.15, 6.00 6.30, 7.00, 7.30,7.50 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రతీ 20 నిమిషాలకు బస్సులు నడుస్తాయన్నారు. ప్రయాణికులు దారి మళ్లింపు విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ మరమత్తుల నిమిత్తం నగరంలో సోమవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ ఆదివారం ప్రకటించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కలిగే అంతరాయంతో స్వరూపనగర్ – తారకరామానగర్ ఏరియాలు, ఎస్ఆర్‌కే స్పిన్నింగ్ మిల్లు ఏరియాలలో ప్రభావం ఉంటుందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ, కలిగే అంతరాయంతో కొంతమూరు గ్రామంలోని నూకాలమ్మ గుడి ప్రాంతం, ముస్లిం పేట, అంబేడ్కర్‌పేట, అఫీషియల్ కాలనీ, పంచాయతీ ప్రాంతం, కాతేరు రోడ్డు, బ్రాహ్మణ అగ్రహారం , బూసమ్మ కాలనీ, శ్రీరామ్ నగర్, బీసీ కాలనీ, వి.వి.కొండయ్య లేఅవుట్ ఏరియాలలో ప్రభావం ఉంటుందన్నారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ కలిగే అంతరాయంతో రాయడుపాకలు, కోలమూరు, కొంతమూరు గ్రామాల్లోని పరిమినగర్, బొమ్మన కాలనీ, ఫోర్త్ బ్రిడ్జి ప్రాంతం, సాయిరాం కాలనీలలో ప్రభావం ఉంటుందన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు 219 మంది హాజరు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు సర్టిఫికెట్ల పరిశీలన కోసం 219మంది విద్యార్థులు హాజరయ్యారని ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేశామన్నారు. సోమవారం 32,001 నుంచి 50,000వరకు వరకూ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

నరసన్న ఆలయానికి భక్తుల రద్దీ

కోరుకొండ: కోరుకొండలో వెలసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ భక్తుల సందడి ఏర్పడింది. కోరిన కోర్కెలు తీర్చే స్వామి అనే నమ్మకంతో భక్తులు ఇక్కడికి వస్తుంటారు. సెలవురోజు కావడం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో సందడి నెలకొంది. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

ఉద్యానవనం.. దుర్గంధ భరితం

- దుస్థితిలో ఏబీ నాగేశ్వరరావు పార్క్ చెరువు
- వ్యాధుల బారిన పడుతున్న వాకర్స్ సభ్యులు
- సౌకర్యాలు కల్పించి మురుగునీటిని తోడించాలని వినతి



వ్యర్థాలతో దర్శనమిస్తున్న పార్కులోని చెరువు



డాక్టర్ ఏబీ నాగేశ్వరరావు పార్కు ముఖ ద్వారం



పార్కులో పెరిగిపోయిన తుప్పలు

రాజమహేంద్రవరం సిటీ: నగరం నడిబొడ్డున ఉన్న స్వాతంత్ర సమరయోధులు డాక్టర్ ఏబీ నాగేశ్వరావు పార్క్ దుర్గంధ భరితంగా తయారైనా నగరపాలక సంస్థ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ఆర్యాపురం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయం ఎదురుగా గల పార్కులో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేసేందుకు సుమారు 150 మంది మహిళలు, వృద్ధులు, పురుషులు, యువకులు వస్తుంటారు. ఈ పార్కులో ఉన్న చెరువు మురికినీటితో సంవత్సరాల తరబడి నిల్వ ఉండిపోవడంతో దుర్గంధ భరితంగా మారిందని, వాకింగ్ చేసే సమయంలో వాసన భరించలేక పోతున్నామంటూ వాపోతున్నారు. ఈ పార్కుకు చుట్టుపక్కల ప్రాంతాలైన ఆర్యాపురం, లింగంపేట, సీతంపేట, కోటిలింగాలపేట, తుమ్మలావ, కోర్లమ్మపేట తదితర ప్రాంతాల నుంచి వాకర్స్ చెరువు చుట్టూ ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తూ ఉంటారు. ఈ చెరువును ప్రధానంగా లోతట్టు ప్రాంతాలైన, ఆర్యాపురం, సీతంపేట, కోటిలింగాలపేట, లింగంపేట తదితర ప్రాంతాలు వర్షం నీటి ముంపు నివారణ కోసం వినియోగిస్తారు. వర్షం నీరు ద్వారా చెరువులోకి మృతకళేబరాలు, చెత్తాచెదారం రావడం, సంవత్సరాల తరబడి మురికి నీరు నిల్వ ఉండిపోవడంతో దుర్గంధ భరితంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో చెరువు చుట్టూ నివసించే ప్రజలతో పాటు వాకర్స్ కూడా అంటువ్యాధుల బారిన పడుతున్నారని వాకర్స్ వాపోతున్నారు. పార్కు నిర్వహణను కూడా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని, పారిశుద్ధ్య సిబ్బంది పార్కువైపు వచ్చిన దాఖలాలే లేవన్నారు. పార్కు చుట్టూ చెట్లు, తుప్పలు పెరిగిపోయి పాముల బారిన పడుతున్నామని వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి అయ్యేసరికి మందుబాబులు, గంజాయి సేవించే వారితో పార్కు అస్తవ్యస్తంగా ఉంటోందని అంటున్నారు. పోలీసులు సైతం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందుబాబులు పార్కులో వాకింగ్‌కి వచ్చే వారితో ఘర్షణ పడుతుంటారని దీంతో మహిళలు భయపడుతున్నారని వాకర్స్ వాపోతున్నారు. సంబంధిత అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టకపోవడంతో వాకింగ్‌కు వచ్చే మహిళలకు రక్షణ కరువైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షం వస్తేచాలు వాకింగ్ ట్రాక్ నీటితో మునిగిపోతోందని, వాకింగ్ చేసేందుకు కూడా వీలు ఉండదని వాపోతున్నారు. పార్కులో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు తుప్పు పట్టి పనికి రాకుండా ఉన్నాయని, వాటిని మార్చే ఆలోచన చేయడం లేదని తక్షణమే నగరపాలక సంస్థ అధికారులు దృష్టి సారించాలని వాకర్స్ కోరుతున్నారు. పార్కు సమస్యలపై స్థానిక నాయకులకు, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చినప్పటికీ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ ఏబీ నాగేశ్వరావు పార్కులో వాకింగ్ ట్రాక్ ఎత్తుచేసి వినియోగంలోకి తీసుకురావాలని, మురికి నీరు చెరువు నుంచి తొలగించి దుర్వాసనను పోగొట్టి వాకర్స్ ఆరోగ్యం పరిరక్షించాలని కోరుతున్నారు. పార్కు సమస్యలపై గ్రీవెన్స్ సెల్‌లో మున్సిపల్ కమిషనర్‌కు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు, సచివాలయం సిబ్బందికి ఫిర్యాదు చేస్తామని వాకర్స్ ప్రకటించారు.

మౌలిక వసతులు కరవు



పార్కులో మహిళలకు మౌలిక అవసరాలు తీర్చే కనీస వసతులు కరువయ్యాయి. పార్కులో ఏర్పాటు చేసిన టాయిలెట్స్ పని చేయడం లేదు. ఆరోగ్యం కోసం పార్కుకు వస్తుంటే దుర్గంధంతో లేనిపోని అనారోగ్యం వచ్చే ప్రమాదకర పరిస్థితి ఉంది. అసాంఘిక కార్యకలాపాలు, మద్యం, మాదక ద్రవ్యాల సేవనం ఎక్కువైపోయింది. మహిళలు సాయంత్రం సమయంలో వాకింగ్ చేసేందుకు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నగరపాలక సంస్థ అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడటం లేదు. పర్యవేక్షణ లేకుండా పోయింది.

– టీర గీతా రత్నం, స్థానిక మహిళ

పూర్తిగా దెబ్బతిన్న వాకింగ్ ట్రాక్



పార్కులో ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ రాళ్లు తేలిపోయి నడవాలంటే ఇబ్బంది కరంగా తయారైంది. జిమ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలు తుప్పు పట్టిపోయాయి. పార్కు చెట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. విషకీటాకాల సంచారం ఎక్కువైంది. సాయంత్రం సమయంలో భయపడుతూ వాకింగ్ చేయాల్సిన దుస్థితి నెలకొంది. పార్కులో ఉన్న చెరువు వ్యర్థాలతో నిండిపోయింది. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చర్యలు చేపట్టాలి

–బొజ్జా రామకృష్ణ, వాకర్స్ అసోసియేషన్ సభ్యుడు

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికుల కుటుంబాలు

కుటుంబాలతో కలసి ధర్నా

రాజమహేంద్రవరం సిటీ: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 45 రోజులుగా నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న తమను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తమ కుటుంబాలకు చెందిన మహిళలు, పిల్లలు, పెద్దలతో నిరసన ప్రదర్శన నిర్వహించి గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ తమ భర్తలకు నెలకు రూ.15 వేలు జీతం అని రూ.2 వేలు కటింగులు పోను రూ.13 వేలు చేతికి ఇస్తారని ఆ మొత్తాన్ని ఇంటి అద్దె, విద్యుత్ బిల్లు, నిత్యావసరాలు, పిల్లల చదువులకు సర్దలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని అప్పుడే తమ బతుకులు బాగు పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమాదుల ఏసుబాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి బుంగ యేషయారాజు, జిల్లా అధ్యక్షుడు కోటాని ముకుందరామ్, నగర అధ్యక్షుడు సిరికి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పాలిక బాల భవానీకుమార్, ఉపాధ్యక్షుడు మందనక్క సాయి, కోశాధికారి బొక్కా శ్రీను, వెదురుపర్తి ఏసు, బండారు గణేష్ పాల్గొన్నారు.

హిందు ధర్మ పరిరక్షణకు నడుం బిగించాలి

శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామీజీ



సమితిని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామిజీ, స్వామిజీలు, ఆధ్యాత్మిక వేత్తలు

రాజమహేంద్రవరం రూరల్: హిందూ ధర్మ పరిరక్షణకు అందరూ నడుం బిగించాలని అమరావతి తాళ్లపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామీజీ పిలుపునిచ్చారు. మన సంస్కృతీ సంప్రదాయాలను, ఆలయ వ్యవస్థ గొప్పతనాన్ని భావితరాలకు అందిస్తూ హిందు ధర్మాన్ని రక్షించుకోవాలనే ధృడ సంకల్పంతో కొంతమూరు షణ్ముఖ పీఠంలో పీఠాధిపతి స్కంధస్వామి స్థాపించిన 'ఆలయాలు హిందూ ధర్మ పరిరక్షణ సమితి'ని ఆయన, పలువురు స్వామీజీలు, ఆధ్యాత్మికవేత్తలు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అడ్డతీగల పవనగిరి క్షేత్రాధిపతి తణుకు వెంకట్రామయ్య, మురమళ్ల శ్రీ విజయ దుర్గా పీఠం ఆస్థాన సిద్ధాంతి బాణాల దుర్గా వర ప్రసాదాచార్యులు, హైదరాబాద్ బాలా త్రిపుర సుందరి పీఠం గురువు కృష్ణమోహన్‌స్వామి, కొంతమూరు సదానంద ఆశ్రమ నిర్వాహకులు సీవీఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆలయాలను, హిందు ధర్మ పరిరక్షణను ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని కోరారు. ధర్మాన్ని నమ్మి ఆచరించినా, విశ్వసించినా అన్నీ ధర్మమే ఇస్తుందన్నారు. ధూప దీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాల పరిరక్షణకు కూడా అందరూ ముందుకు రావాలని ఆకాంక్షించారు. క్షేత్రస్థాయిలో గో సంరక్షణ కేంద్రాల ఏర్పాటు, హిందువులు, దేవాలయాలపై జరుగుతున్న దాడుల దృష్ట్యా ప్రతీ హిందువు తనకు ఉన్న హక్కుల గురించి పూర్తిగా తెలుసుకుని సరైన రీతిలో, వాటిని ఎదుర్కొనే రీతిలో చైతన్యం తేవడమే సమితి ప్రధాన లక్ష్యమని తెలిపారు. పూర్వ గురుకుల విద్యా విధానం అమలు చేస్తూ పునః ప్రారంభించాలని, దేవదాయ ధర్మాదాయ శాఖ ఖజానా నుంచి ఈ కార్యక్రమాలను ప్రారంభించేలా జీవో జారీచేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ కుటుంబం నుంచి ఒక వ్యక్తిని ధర్మ రక్షకునిగా తయారు చేయాలని సూచించారు. ఈ సమితికి వ్యవస్థాపక అధ్యక్షులుగా స్కంధ స్వామి వ్యవహరించడం అభినందనీయమన్నారు. కంటిపూడి గ్రూప్స్ అధినేత కంటిపూడి సర్వారాయుడు, ఆడిటర్ పీవీఎస్ కృష్ణారావు, మహాసందేశ్ ఆఫ్ ది ట్రస్ట్ చైర్మన్ జె.సత్య శ్రీనివాస్, బీజేపీ రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, వైఎస్సార్ సీపీ జిల్లా వైద్యవిభాగ అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత, హిందు ధర్మ రక్షా సమితి రాష్ట్ర అధ్యక్షుడు చేదులూరి గురవయ్య, షణ్ముఖ సేన నుంచి పడాల వీరారెడ్డి, కుంచే సూర్య ప్రకాష్, ఏబీ సుబ్రహ్మణ్యం, ఉదయ్‌కుమార్, సూర్య వర ప్రసాద్ రెడ్డి, వడ్డి రామకృష్ణ, స్కంధ సేన, నారీ శక్తి సేన సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం దేవాలయాల్లో నిత్య పూజలకు అవసరమైన కిట్లను అందజేశారు.

పారిశుధ్య సేవలు అభినందనీయం



కార్మికులను సత్కరించిన మాజీ ఎమ్మెల్యే సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: పవిత్ర గోదావరి తీరాన ఉన్న పుష్కరాలరేవులో నిత్యం పుణ్య స్నానాలు చేసేందుకు వచ్చే భక్తులు, యాత్రికుల కోసం రేవును పరిశుభ్రం చేస్తున్న పారిశుధ్య అధికారులు, కార్మికులు అభినందనీయులని మాజీ ఎమ్మెల్యే, పుష్కర ఘాట్ గోదావరి స్విమ్మర్స్ క్లబ్ శాశ్వత గౌరవ అధ్యక్షుడు రౌతు సూర్యప్రకాశరావు కొనియాడారు. ఆదివారం క్లబ్ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం శానిటరీ ఇన్‌స్పెక్టర్ అల్లం దుర్గాప్రసాద్, శానిటరీ మేస్త్రీలు, కార్మికులను శాలువాలతో సత్కరించి, మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ గోదావరి నదికి ఎన్ని స్నానాల రేవులు ఉన్నా పుష్కరాల రేవుకు ఉన్న ప్రాముఖ్యం, ప్రాధాన్యం దృష్ట్యా ఇక్కడే స్నానమాచరించాలని భక్తులు, యాత్రికులు కోరుకుంటారన్నారు. పుష్కరాల రేవును నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు శానిటరీ మేస్త్రీ గుత్తుల వెంకటరమణ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. సన్మాన కార్యక్రమంలో గోదావరి స్విమ్మర్స్ క్లబ్ సభ్యులు నందం లక్ష్మణమూర్తి, మాదాల వెంకటేశ్వరరావు, అధ్యక్షుడు గుబ్బల వెంకటరమణ, కార్యదర్శి పాలపర్తి దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ ఏడవ వార్షికోత్సవం



సామూహిక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు నేతాజీ నగర్ బృందావన కాలనీలో శ్రీ వరసిద్ధి వినాయక సంతాన సుబ్రహ్మణ్యేశ్వర వేణుగోపాల స్వామి ఏడవ వార్షికోత్సవం ఆలయ కమిటీ చైర్మన్ సీహెచ్ రవికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే ఆలయ అర్చకులు వి.నారాయణ, పండితులు వి.సాయికుమార్ స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం వేద పండితులు కోడూరి బుచ్చిరాజు శర్మ సుమారు 40 మంది జంటలతో సామూహిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వ్రతాలను ఆచరింపజేశారు. 500 మంది భక్తులు, గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామిని దర్శించి ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆదివారం రాత్రి ఆలయ ప్రాంగణంలో త్రిమూర్తులు గురుస్వామి బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భజన కార్యక్రమం భక్తులను అలరింపజేసింది. ఆలయ కమిటీ సభ్యులు ఈశ్వరరావు బ్యాంక్ ప్రసాద్ రాజు, చక్రవర్తి, దుర్గారావు, ఎం శ్రీనివాసరావు, దుర్గాదేవి, లక్ష్మీ దుర్గ, భవాని,లక్ష్మి, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వ్యాపారంలో పురోగతి

సాధారణ మహాజన సభలో ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ బాబు



మహాజన సభలో మాట్లాడుతున్న బ్యాంక్ చైర్మన్ బాబు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాబోయే సంవత్సరంలో బ్యాంక్ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ది ఇన్నీసుపేట కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కోళ్ళ అచ్యుత రామారావు (బాబు) అన్నారు. ఆదివారం స్థానిక మంగళవారపుపేటలో అల్యూమినియం మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ హాల్లో ఇన్నీసుపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 107వ సాధారణ మహాజన సభ జరిగింది. సభకు అధ్యక్షత వహించిన బ్యాంక్ చైర్మన్ కోళ్ళ అచ్యుత రామారావు మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ వ్యాపార అభివృద్ధిలో మంచి పురోగతి కనబరిచామని తెలిపారు. బ్యాంక్ డిపాజిట్లు గత సంవత్సరం రూ.141.07 కోట్లు ఉండగా ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 3.45 కోట్లు పెరిగి రూ.144.52 కోట్లకు చేరిందని వివరించారు. అప్పులు రూ.3.63 కోట్లు పెరిగి రూ.99.33 కోట్లకు చేరాయని పేర్కొన్నారు. అప్పులలో అధిక పురోగతి లేనప్పటికీ, రుణ వసూలులో బ్యాంక్ ముందంజలో ఉందని తెలిపారు. బ్యాంక్ నిరర్థక ఆస్తులు (ఎన్.పి.ఎ) 41 ఖాతాలతో రూ 2.81 కోట్లుగా ఉందని చెప్పారు. ఆ మేరకు గ్రాస్ ఎన్.పి.ఎ 2.83 శాతం ఉందని తెలిపారు. గత సంవత్సరం బ్యాంక్ నికర లాభం రూ 114.33 లక్షలు ఉండగా ఈ సంవత్సరం రూ.123.08 లక్షలకు పెరిగిందని తెలిపారు. రిజర్వ్ బ్యాంక్ నిర్దేశించిన సీఆర్ ఎ ఆర్ రేషియో 10 శాతం కంటే అధికంగా 14.66 శాతం కలిగి ఉందన్నారు. వచ్చే సంవత్సరం 11 శాతం మేరకు డివిడెండ్ ఇస్తామన్నారు. బ్యాంక్ వైస్ చైర్మన్ గేడి పోతురాజు, బ్యాంక్ సీఈవో పాలకోడేటి రమణకుమార్, బ్యాంక్ డైరెక్టర్లు ఆదిరెడ్డి శ్రీనివాసరావు, అందనాపల్లి సత్యనారాయణ, కురిమిల్లి శాంతి స్వరూప్, కటారి శ్రీనివాస్ కన్నా, నారపరెడ్డి సన్ని , జామి వెంకటరమణ మూర్తి, పాడిపిరెడ్డి శివ, పంచకట్ల శివప్రసాద్, దాది సత్యనారాయణ, గుత్తుల భాస్కర్‌రావు, ప్రొఫెషనల్ డైరెక్టర్లు రెడ్డి సూర్య సుబ్రహ్మణ్యం, కటికి లీలాకృష్ణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



కూనవరంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం/కోరుకొండ: సీతానగరం, కోరుకొండ మండలాల్లో ఇటీవల పలు కారణాలతో మరణించిన వారి కుటుంబాలను, అనారోగ్యంతో చికిత్స పొందినవారిని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆదివారం పరామర్శించారు. సీతానగరం మండలం రాపాకలో సబ్బితి చంటియ్య మరణించగా వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. సీతానగరంలో ఓసిరెడ్డి రామలింగయ్య తల్లి, బూలా వెంకటేష్ తల్లి, బూలా నరేష్ కుమారుడు, బుజ్జమ్మ ఇటీవల మరణించిన కారణంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న తవిటికి అరవాలు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కూనవరంలో పూటి రాజేశ్వరి, బడుగు కిషోర్, నందూరి కాపు, అయిల సూరన్న కాపు అత్తయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కోరుకొండ మండలం మునగాలలో అలమంద వెంకటలక్ష్మి ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తలకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న డెగపాటి దోసుడు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాపవరంలో బర్రు అంజిబాబు తల్లి, పేరారా సుబ్బారావు ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నరసాపురంలో చొంగ చెంచారావు, కింతాడ వెంకన్న ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చొంగా సత్తిబాబు, నక్కా అర్జునుడు, పెదపాటి శివ నాగేశ్వరరావు, సోడాసాని త్రిమూర్తులు అనారోగ్యంతో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న కారణంగా వారిని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యులు నల్లమోలు భాస్కర్, వెన్నెల అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, సుంకర నరసింహం, కోరుకొండ మండలం కన్వీనర్ అడప కనకరాజు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నక్కా రాంబాబు పాల్గొన్నారు

సినిమాలు



శ్యామల	:	28 ఇయర్స్ లేటర్
సూర్యమినీ	:	8 వసంతాలు
సూర్యప్యాలెస్	:	సితారే జమీన్ పర్
స్వామి	:	కుబేర
అనుశ్రీ	:	కుబేర
శివజ్యోతి	:	కుబేర
ఊర్వశి	:	భైరవం
మేనక	:	సింగిల్
రంభ	:	హౌటు ట్రెయిన్ యువర్ డ్రాగన్
అప్సర	:	సితారే జమీన్ పర్
అశోక	:	8 వసంతాలు
నామవరం		
వివిఎస్.మహల్	:	కుబేర
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	కుబేర
కడియం		
వెంకటసూర్య	:	కుబేర